వేషం

శ్రీమతి ఆర్. వసుంధర

సెప్టెంబరు నెల వచ్చినా యింకా ఎండ మాడ్చేస్తోంది. ఇంటిముందు కాంపౌండులో పూర్తిగా పరచిన మన్నని నల్లని కడపబండల మీదినుంచీ ప్రతిఫలిస్తున్న ఎండవేడిమి పొగలూ సెగలూ చిమ్ముతూ మేడమీది బాల్కనీలోనికి కోపంగా విరుచుకు పడుతోంది. పైన తిరుగుతున్న ఫాను అక్కడున్న వేడిగాలినే యింకొంచెం వేగంగా మీదికి విసురుతున్నందున అది వుపకారం చేస్తోందో అపకారం చేస్తోందో చెప్పనీల్లేకుండా వున్నది. గేటు బయట వీధిలోని మనుష్యులు ఎండవేడిమి భరించలేక ఎవరో తరుముతున్నట్లు గబగబా నడిచేస్తున్నారు. ప్రకృతి అంతా ఎండనుంచీ తప్పించుకునే ప్రయత్నంలో అటూ యిటూ పరుగెట్టి అలసిపోయి నీరసంగా వాలిపోయినట్లుంది.

పైన సోఫాలో కూర్చుని అప్పుడే వచ్చిన నాగయ్యబావతో మాట్లాడటానికి ప్రయత్నిస్తోంది ఇందిరమ్మ. అతను ఏదో పనిమీద ఆ వూరువచ్చి నాలుగురోజులైందట. పనయ్యాక ఆమెను చూడటానికనీ, వాళ్లమ్మ పంపిన ఆవకాయజాడీ యివ్వటానికనీ వచ్చాడు.

అతను ఇందిరకు మేనత్త కొడుకు. వాళ్లకీ వీళ్లకీ అంతగా రాకపోకలుగాని సంబంధాలుగాని లేవు. అదీ గాకుండా వాళ్లిద్దరికీ వయస్సులో పదిహేను సంవత్సరాలు తేడా వుండటాన మొదట్నుంచీ అతనితో ఏ విధమైన చనవుగానీ సంబంధంగానీ ఏర్పడలేదు.

అతన్నిచూసి యిప్పటికి పదిహేను సంవత్సరాలు గడిచిపోయింది. అప్పటికీ యిప్పటికీ అతను ఏమీ మారలేదు. అట్లాగే నల్లగా సన్నగా కడ్డీలాగా వున్నాడు. లావుగా మోటుగా వుండే పెదాలూ, ఎత్తైన నుదుటిక్రింది లోతులో ఎర్రగా మెరుస్తూ కత్తుల్లాంటి చూపుల్తో అవతలి మనిషిని నిర్దాక్షిణ్యంగా చీల్చేసే చూపులూ, నిముషం ఖాళీ లేకుండా ఒకదానివెంట వొకటిగా బీడీలు కాల్చి పీకలు విసిరెయ్యడం – ఊహూ, ఏమీ మారలేదు అతను!

నాగయ్య బావ వచ్చాడని వినగానే పుట్టింటి మీది అభిమానం పొంగి అతనివేపు ప్రవహించింది. సంతోషంగానే పలకరించడానికి వచ్చింది కాని తీరా అతని ఎదుటికి రాగానే అతని మొరటు స్వభావం గుర్తుకు రాగనే సంతోషమంతా ఆవిరైపోయింది.

చిన్నపిల్లగా వున్నప్పుడు కూడా అతను తన వేపు చూస్తేనే తికమక పడిపోయేది ఇందిర. తానెరిగినప్పటినుంచీ అతను విప్లవకారుడు. ఇరవై ఏళ్లనాటి కమ్యూనిస్టు అల్లర్లలో 'కనుపించగానే కాల్చి వెయ్యవలసిన' వారి జాబితాలో వున్నాడు. ఆ మధ్యన ప్రత్యేక తెలంగాణాకోసం కృషి చేశాడు. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాలోని నక్సలైటు వుద్యమంలోనికి వెళ్లబోతున్నట్లు అమ్మ చెప్పింది. ప్రాణమంటే జీవితపు జూదంలో పణంగా పెట్టవలసిన తృణం అతని దృష్టిలో. వర్గ పోరాటం మించిన సత్యంగాని విలువలుగాని లేవు అతనికి యీ ప్రపంచంలో.

ఇదివరల్లో అతన్ని చూచిన కొద్దిసార్లూ తనలో రేకెత్తిన అస్పష్టమైన భయాందోళనల్నీ గాభరానీ జయించాలని చాలా ప్రయత్నించి ఓడిపోయింది ఇందిర. తాను అతనికంటే అన్నివిధాల ఎక్కువేనని

గుర్తుకు తెచ్చుకున్నది. తనకు డబ్బున్నది. చదువున్నది. మంచీ మర్యాదా వున్నవి నాగరిక ప్రపంచంలో తానూ ఒక మంచి భాగం... అతని కివేవీ లేవు... అయినా ఎందుకో అతన్ని చూస్తే ఇందిరకు భయం

అతని చిన్నతనంలో చదువు నేర్పే సందర్భంలో అతని బండతనానికీ మొండితనానికీ విసిగి, తన తండ్రి - అతని మేనమామ - అతన్ని స్తంభానికి కట్టేసి పలుపు తాటితో వాతలుపడేట్లు బాదుతూ వుంటే, మేనత్త వచ్చి 'నాయనా, వాడికి చదువు అబ్బకపోతేమానెగాని ప్రాణాలతో వుండనివ్వరా' అని తమ్ముడికి చెప్పి విడిపించేదట... అతన్ని చూస్తూ కసిగా ఆ దెబ్బల్ని వూహించుకుంటుంది ఇందిర... ఒకటి, రెండు, మూడు... యింకా, యింకా... మేనత్త వచ్చి విడిపించేవరకూ... కాని యీ ఆధిక్యతలన్నీ అతని తీక్షణమైన చూపుముందు సుడిగాలిలో దూది పింజల్లాగా ఎగిరిపోతాయి. అంతలోనే, ఆదే కత్తులు గుచ్చే తీక్షణమైన చూపుతో చిన్నగా నవ్వుతూ 'యీ సారి లిస్టులో మామయ్య పేరున్నది' అంటున్న దృశ్యం గుర్తుకొస్తుంది. కమ్యూనిస్టులు యీ భూమిమీదనుండీ తుడిచి పారెయ్యాలనుకున్న గవర్నమెంటు వుద్యోగుల పేర్ల లిస్టు అది. ఆ మామయ్య తన తండ్రి. నాగయ్య బావకి జాలీదయా ఏకోశానా లేవు. అతన్ని గురించి తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది ఇందిరకు... ఇప్పుడు అతని ఎదురుగా కూర్చొని, యీ పదిహేనేళ్లలో తను సంపాదించిన జీవితానుభవమూ, డబ్బూ హోదాలు యిచ్చిన అధికారమూ అన్నీ మాయమైపోగా, ఆ నాటి చిన్న పిల్లలాగే తబ్బిబ్బు పడిపోతోంది.

అతను ఏమీ పట్టించుకోకుండా బయటకు చూస్తూ బీడీ కాలుస్తున్నాడు.

ఫాన్ విసురుతున్న వేడిగాలికి ఒళ్లంతా ఉడుకెత్తిపోతోంది. చల్లగావుండే తడిగుడ్డ మీద కప్పుకోవాలనిపిస్తోంది

'చాలా ఎండగా వున్నది కదూ' అన్నది ఇందిర అరిచేతులతో మొహాన్ని ఎండగాలినుండి కప్పుకుంటూ.

అతను మాట్లాడకుండా ఒకసారి యిటు చూసి మళ్లీ చూపు తిప్పుకున్నాడు అతను చూడగానే ఇందిరకు తనేదో తప్పుచేసినట్లూ అసందర్భంగా మాట్లాడినట్లూ అన్పించింది 'పాపం, ఎండా చలీ అన్నీ బాధలే మీకు... యీ వేషాలన్నీ కాలిక్రింద రాచెయ్యాలి' అన్నట్లు తోచింది

నాగయ్యబావ మనిషి కాదా? అతని చర్మం ఎండా చలీ తాకకుండా మొద్దుబారిపోయింది కాబోలు. పోలీసులు అతనికోసం వేటకుక్కల్లా వెతుకుతున్నప్పుడు పొలాల్లో రోజుకో గడ్డివామిలో నిద్రపోతూ, పగలు ఏ తోటలోనో పాడుపడిన గుడిచీకటిలోనో మనిషి తిరగనిచోట గడుపుతూ, నమ్మకస్తుడైన మాలవాడెవడో వీలున్నప్పుడు కూలివాడిలా తెచ్చుకున్న అన్నం అందిస్తే తింటూ, లేకుంటే పస్తుంటూ—అబ్బ! ఏం జీవితం! ఏదో గొప్ప వినాశకరశక్తి అతనిలోనుండి యిలాంటి బ్రతుకును మోస్తోంది, కోరుతోంది... అనుకుంది ఇందిర.

ఏ మాటా పలుకూ లేని యీ నిశ్శబ్దం ఇందిరకు దుర్భరంగా వున్నది. వంట మనిషిని కేకేసి కాఫీ చేసుక రమ్మన్నది.

'నాకు చక్కెర ఖర్లేదు. స్ట్రాంగ్‌గా కావాలి' అన్నాడు నాగయ్య బావ బీడీ పొగ వొదులుతూ. 'ఇంకో పదిహేను నిమిషాల్లో నేను వెళ్లిపోవాలి' అన్నాడు.

'ఎందుకనీ? యివాళ వుండరాదా... రాత్రికి ఆయన కాంపునుండీ వస్తారు' అన్నది.

'పనుంది' అన్నాడు.

నీ మొగుడంటే నాకేం లెఖ్ఖ అన్నట్లుగా తోచింది ఇందిరకు. కోపం వచ్చింది కల్లూ వాకిలీ లేకుండా పైసా డబ్బు సంపాదించకుండా నీవు చేస్తున్న ఉద్ధారకం ఏమిటో అనడగాలనిపించింది. అతను బయట ఎండనీ రోడ్డునీ చూస్తున్నాడు.

రింగులు తిరిగి పొట్టిగావున్న నల్లటి జుట్టు ఎక్కడ ప్రారంభిస్తుందో తెలియకుండాజేసే నల్లని మోటు చర్మమూ మానవత్వం ఎరుగనట్లుండే మొహమూ చూచి మరేం మాట్లాడకుండా వూరుకుండిపోయింది.

జవాను చంద్రయ్య వచ్చాడు. క్రొత్త వ్యక్తిని చూచి 'మళ్లీ వస్తానమ్మా' అన్నాడు. 'ఫర్వాలేదు చెప్పు' అన్నది ఇందిర. అందరు జవాన్లలోకీ వినయ విధేయతలు గలవాడు చంద్రయ్య.

'తమరు దయుంచాలమ్మా...నాకు ఎరన్డ్ లీవూ కాజువల్ లీవూ అన్నీ అయిపోయాయమ్మా ఆడదాని జబ్బుతో...ఇప్పుడు నాలుగురోజులు అర్జంటుగా వూరికెళ్ళాల్సిన అవసరం పడిందమ్మా...తమరి దయ' అన్నాడు చేతులు నలుపుకొంటూ.

'అయ్యగారి నడక్కపోయావా' అన్నది ఇందిర.

'అడిగానమ్మా...సెలవంతా అయిపోతే జీతం నష్టంవిూద పో అన్నారు...పేదవాణ్ణి...'అన్నాడు చంద్రయ్య.

'అన్నీ సెలవులూ అయిపోతే రూల్సు ప్రకారం అంతేనేమో' అన్నది ఇందిర.

'అట్లాగా కాదుతల్లమ్మా అయ్యగారు దేముడు. నాకు వుద్యోగం యిచ్చారు. తప్పులుచేస్తే క్షమించారు. ప్రమోషన్ యిచ్చారు. టి.ఎ.లు యిప్పించారు. ఎన్నో సాయాలు చేశారమ్మా...ఇప్పుడెందుకో నావిూద దయతప్పింది...' అన్నాడు.

తాము దయాపరులమని అందరూ అంటూంటే వినటం చాల యిష్టం ఇందిరకు నిజానికి తాము చాలా దయాగుణం కలవారమని అనుకుంటుంది కూడాను. తమ దయాదాక్షిణ్యాల్ని గురించి చంద్రయ్య చెప్తుంటే ఇందిర నాగయ్య బావవేపు చూసింది దర్పంగా. అతను ఏదీ విననట్లు రోడ్డువైపు చూస్తూ యింకో బీడీ ముట్టించుకున్నాడు. ఇతరుల మంచితనం గురించి నీవు వినవులే అనుకుంది ఇందిర.

'సెలవు లేకపోతే ఎట్లా యిస్తారూ? రూల్సు ప్రకారం అందరికీ ఎట్లాగో నీకూ అంతే గదా' అన్నది విసుగ్గా.

'అంతమాట అనొద్దమ్మా...ఇంతదాకా నన్ను చాలా దయగా చూశారు తమరు...ఇప్పుడు ఎవరో నా విూద పుచ్చులు చెప్తున్నారేమో...నే నే పాప మెరగనమ్మా' అన్నాడు కళ్లు నులుముకుంటూ.

ఈ చంద్రయ్యకు బుర్రలో బంకమన్ను నిండి వున్నది కాబోలు. తన ధోరణి తనదేగాని అవతలవాళ్లు చెప్పేది ఏవీ అర్థం చేసుకోడు అనుకొని విసుక్కుంది ఇందిర...తనక్కావలసినవన్నీ యివ్వటమే దయ అని చంద్రయ్య అభిప్రాయం లాగుంది. అందరికీ వుండే రూల్సును పట్టించుకోకుండా, తన కోరికల ప్రకారంగా ఆ 'దయ' ప్రత్యేకంగా తన విూదనే ఎందుకువర్షించాలని ఆలోచించే తెలివి లేదు ఇన్నాళ్లా యిచ్చారు, యిప్పుడూ యివ్వాలి అంతే తెలుసు!

ఇంతవరకూ నిరాటంకంగా ఆలోచించిన ఇందిర 'దయ అనేది అవ్యాజమూ ఉదాత్తమూ అయిన భావంకదా; కారణం వుండాలంటే అది దివ్యమైనది ఎట్లాగవుతుందీ' అన్న విూమాంసలో పడ్డది కాస్సేపు

నాగయ్యబావ యిదంతా విని ఏమి అపార్థాలు తీసి ఎగతాళి పట్టిస్తాడోఅన్న అనుమానం కలిగింది ఇందిరకు. అతని ముందర యిదంతా జరగటం ఇబ్బందిగావున్నది. చంద్రయ్యకు ఎప్పుడేం మాట్లాడా లన్న ఇంగితజ్ఞానం లేదనుకున్నది. గట్టిగా చంద్రయ్యను కోప్పడితే బూర్జువా పద్ధతిలోని అహం భావం అంటాడు నాగయ్యబావ ఇందిరకు ఏమీ పాలుపోలేదు. 'అయ్యగారొచ్చేక ఏదోఒకటి చూస్తారులే' అని అప్పటికి చంద్రయ్యను ఒదిలించుకున్నది.

వంటావిడ కాఫీతెచ్చి యిద్దరికీ యిచ్చింది

నాగయ్యబావ అంత వేడికాఫీని ఒక్క నిముషంలో త్రాగేసి కప్పు క్రిందపెట్టి బీడీ వెలిగించాడు.

చిన్నగా నవ్వుతూ 'మీ రిక్కడ అందరిమీదా దయ చూపిస్తూ చిన్నసైజు దేవుళ్ళుగా వుంటున్నారన్న మాట.' అన్నాడు.

గతుక్కుమన్నది ఇందిర. తా నూహించినట్లు గానే పెడర్థం తీసేశాడు! ఆ మాటల్లోని వ్యంగ్యం కరిచినట్లయింది అతనిమీద చాలాకోపం వచ్చింది.

'ప్రతిదాన్నీ విప్లవంపేరిట నాశనం చేసే వాళ్లకు, మంచిదంతా మోసం అనేవాళ్లకు— హత్యలకూడా వెనుదియ్యనివాళ్లకు - దయనుగురించి ఏం తెలుస్తుందిలే అనుకుంది.

కానీ చిత్రమేమిటంటే 'మీరు స్వార్థపరులు మీ దయ వుత్తవేషం పేదలఎడ, పీడిత ప్రజానీకం ఎడ సానుభూతిగలవాళ్లం మేమే' అంటారు వాళ్లు.

'దయ మా వేషమైతే విప్లవం నీ వేషం' అనుకుంది ఇందిర.

అతను వెళ్లటానికి లేచాడు. వాకిటిదగ్గరకు వెళ్లి ఆగి వెనక్కితిరిగి చూశాడు మోటుగావుండే పెదాలు విడివడి చిన్నగా చక్కగా అచ్చంగా శాంతమ్మత్తయ్యకిలాగే వరుసగావుండే పలువరుస కన్పించి మాయమైంది...తను నవ్వటంలోఏదో తప్పు చేస్తున్నట్లు యిబ్బందిగా ముక్తసరిగా నవ్వుతాడు నాగయ్యబావ...ఇదివరలో కొన్నిసార్లు చూచిందే అయినా ఆ నవ్వు ప్రతిసారీ ఇందిరకు ఆశ్చర్యంతో పాటు కించిత్ ఆనందం కలిగిస్తుంది.

'వెళ్తాను' అంటూ గబగబా మెట్లుదిగి గేటు దాటి ఎండలోకి వెళ్ళిపోయాడు.

నెలరోజుల తర్వాత ఒకనాడు పేపరుచూస్తున్న ఇందిరమ్మ ఒక వార్తదగ్గర ఆగి పరీక్షగా చదివింది కొత్తగూడెందగ్గర ఒక దోపిడీసందర్భంలో కాల్చి వేయబడిన నలుగురు నక్సలైట్ల పేర్లలో నాగయ్య బావ పేరుకూడా వున్నది.

'అయ్యయ్యో! మా నాగయ్యబావే!' అనుకుంది ఇందిరమ్మ విచారంగా.